సాక్షి శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం । 23 । మే । 2024



సోమశిలలో 7.640 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారానికి 7.640 టీఎంసీలు ఉన్నాయి. పెన్నా డెల్టాకు 200, ఉత్తర కాలువకు 5, దక్షిణ కాలువకు క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.76,490
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,851
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,056
నవర (8 గ్రాములు)	రూ.56,448



రెప్పపాటులో ఘోర రోడ్డు ప్రమాదం

దగదర్తి మండలం సున్నపుబట్టి సమీపంలో బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. డ్రైవర్ మృతి చెందగా ఎనిమిది మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. 8లో

న్యూస్‌రీల్

రేపు సుప్రీంకోర్టు న్యాయమూర్తి రాక

నెల్లూరు (దర్గామిట్ట): ఈ నెల 24వ తేదీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.రవి కుమార్ నెల్లూరు రానున్నారు. శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు నెల్లూరు చేరుకుని ప్రభుత్వ అతిథి గృహంలో బస చేస్తారు. 25వ తేదీ శనివారం ఉదయం 8 గంటలకు నెల్లూరు నుంచి బయలుదేరి తిరుపతి వెళ్తారు.

డీసీపల్లిలో 829 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో బుధవారం 829 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 957 బేళ్లు రాగా వాటిలో 829 విక్రయించామన్నారు. మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో 104393 కిలోల పొగాకును విక్రయించగా రూ.2,72,36,479 వ్యాపారం జరిగింది. కిలోకు గరిష్టంగా రూ.320, కనిష్టంగా రూ.205 ధర లభించింది. సగటున రూ.260.90 ధర నమోదైంది. వేలంలో 17 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.320

కలిగిరి: కలిగిరి పొగాకు వేలం కేంద్రంలో బుధవారం కిలో పొగాకు గరిష్ట ధర రూ. 320 లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 601 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకు రాగా 546 పొగాకు బేళ్లను కొనుగోలు చేశారు. 36 బేళ్లను వివిధ కారణాలతో కొనుగోలు తిరస్కరించారు. వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ మాట్లాడుతూ కిలో పొగాకుకు గరిష్టంగా రూ.320, కనిష్టంగా రూ. 205 ధర పలకగా, సగటున రూ. 269.71 లభించిందన్నారు. వేలంలో 15 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

పకడ్బందీగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు




మాట్లాడుతున్న ఆర్‌ఐఓ శ్రీనివాసులు

నెల్లూరు (టౌన్): ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్‌ఐఓ ఆదూరు శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం నగరంలోని కేఏసీ జూనియర్ కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్‌లు, కస్టోడియన్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 51 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సౌకర్యం, టాయిలెట్లు, ఫర్నీచర్ తదితర వసతులపై దృష్టి సారించాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డీఈఓ మధుబాబు, జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు దీన్‌దయాళ్, వేణుగోపాల్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

25న డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ల ఉద్యోగాలకు పరీక్ష

నెల్లూరు (టౌన్): ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఇన్ ఏపీ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ ఉద్యోగాలను ఈ నెల 25న పరీక్ష నిర్వహించనున్నట్లు డీఆర్వో లవన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు జరుగుతుందన్నారు. జిల్లాలోని కావలి పీబీఆర్ విశ్వోదయ ఇంజినీరింగ్ కళాశాల, ఆర్ఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల, కోవూరు సమీపంలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాల, నెల్లూరు నగరంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాల, పాట్టిపాళెంలోని అయాన్ డిజిటల్ సెంటర్‌లో పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులను ఉదయం 7.30 నుంచి 8.15 గంటల వరకు పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తామన్నారు. ఆపై ఆలస్యంగా వచ్చిన వారిని గ్రేస్ పిరియడ్‌లో 8.30 గంటల వరకు అనుమతిస్తామన్నారు.

గవర్నర్‌కు ఘనంగా వీడ్కోలు



రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు వీడ్కోలు పలుకుతున్న కలెక్టర్

నెల్లూరు (దర్గామిట్ట): విక్రమ సింహపురి యూనివర్సిటీ స్నాతకోత్సవంలో పాల్గొని తిరిగి విజయవాడ వెళ్తున్న రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్‌కు కలెక్టర్ ఎం.హరినారాయణన్, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ సుందరవల్లి, రిజిస్ట్రార్ రామచంద్రారెడ్డి వీడ్కోలు పలికారు. మంగళవారం రాత్రి నెల్లూరు విచ్చేసిన గవర్నర్ బుధవారం వీఎస్‌యూ స్నాతకోత్సవంలో పాల్గొని నెల్లూరు నుంచి సాయంత్రం 6 గంటలకు సంఘమిత్ర ట్రైన్‌లో బయలుదేరి విజయవాడ వెళ్లారు.

డిజిటల్ విప్లవంతో సరికొత్త మార్పులు

నైతిక విలువలతో ఉన్నత స్థానాలు

- వీఎస్‌యూలో మౌలిక వసతులు భేష్
- రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్
- అట్టహాసంగా 8,9 స్నాతకోత్సవాలు
- విద్యార్థులతో కోలాహలం



గవర్నర్ అబ్దుల్‌నజీర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న వీఎస్‌యూ వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి

వెంకటాచలం: డిజిటల్ విప్లవం విద్యతో సహా మన జీవితంలో ప్రతి అంశాన్ని మార్చి వేసిందని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. వెంకటాచలం మండలం కాకుటూరులోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయంలో 8,9 వ స్నాతకోత్సవ వేడుకలు గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అధ్యక్షతన బుధవారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ఈ డిజిటల్ యుగంలో పోటీతత్వం ఉండటానికి ఉన్నత విద్యాసంస్థలు తప్పని సరిగా డిజిటల్ పరివర్తన సాంకేతికతలను, కృత్రిమ మేధస్సును స్వీకరించాలన్నారు. విద్యార్థులకు వారి భౌగోళిక స్థానంతో సంబంధం లేకుండా ఉన్నతమైన నాణ్యతతో కూడిన విద్యను అందించడానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడంపై ఎక్కువ దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. నాణ్యమైన విద్యను పొందలేని మారుమూల ప్రాంతాల విద్యార్థులకు ఇది చాలా ముఖ్యమన్నారు. విద్యార్థులందరికీ సమానమైన అవకాశాలు కల్పించేందుకు ఆన్‌లైన్ బోధన, ఇ-లెర్నింగ్ సిస్టమ్ వంటి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల సాంకేతికతను ఉపయోగించడం చాలా అవసరమన్నారు. కమ్యూనిటీ డెవలప్‌మెంట్, కాలేజ్ టు-విలేజ్, ల్యాబ్ టు ల్యాండ్, సోషల్ అవేర్‌నెస్ కార్యక్రమాలను వీఎస్‌యూ ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇండస్ట్రీ వర్క్‌షాప్‌ల ద్వారా విద్యా సంస్థలు, పరిశ్రమల మధ్య సహకారాన్ని పెంపొందించడంలో వీఎస్‌యూ చేస్తున్న కృషిని ప్రశంసించారు. వీఎస్‌యూలో అత్యాధునిక భవనాలు, అంతర్గత రహదారులు, కంప్యూటర్ల కోసం సౌరశక్తిని ఉపయోగించడం , ఉన్నత స్థాయిలో మౌలిక సదుపాయాలు వీఎస్‌యూ అంకితభావానికి నిదర్శనమన్నారు. తొలుత వీఎస్‌యూకు వచ్చిన గవర్నర్‌కు వర్సిటీ వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి, కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి ఘన స్వాగతం పలికారు. పోలీసుల నుంచి గవర్నర్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం యూనివర్సిటీ ప్రొఫెసర్లతో గ్రేస్ మీటింగ్‌లో గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ గ్రూప్ ఫొటో దిగారు. వీసీ వీఎస్‌యూ ప్రగతి నివేదిక, కార్యాచరణ ప్రణాళిక నివేదికను క్లుప్తంగా వివరించారు. అనంతరం ప్రముఖ ఈఎన్‌టీ శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ ఈసీ వినయ్‌కుమార్‌కు వీఎస్‌యూ నుంచి గౌరవ డాక్టరేట్‌ను గవర్నర్ ప్రదానం చేశారు. అలాగే గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు, రీసెర్చ్ స్కాలర్లకు డిగ్రీ పట్టాలు, గోల్డ్ మెడల్స్‌ను గవర్నర్ అందజేశారు.

అట్టహాసంగా వీఎస్‌యూ 8,9వ స్నాతకోత్సవాలు

విక్రమసింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) 8, 9వ స్నాతకోత్సవ వేడుకలు బుధవారం వీఎస్‌యూలో అట్టహాసంగా జరిగాయి. ఉదయం 9.30 నుంచి వీఎస్‌యూ ప్రాంగణంలో విద్యార్థినీ, విద్యార్థులతో పాటు, వారి తల్లిదండ్రులతో కోలాహల వాతావరణం నెలకొంది. స్నాతకోత్సవాల సందర్భంగా రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్, పరిశోధనా డాక్టరేట్లు, డిగ్రీ పట్టాలు పొందిన విద్యార్థులు ఆనందోత్సవంతో సందడి చేశారు. గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్లు, డిగ్రీ పట్టాలు పొందిన విద్యార్థులను చూసి వారి తల్లిదండ్రుల సంతోషాలకు అవధుల్లేవు. గ్రాడ్యుయేషన్ డే పూర్తయిన తర్వాత విద్యార్థులు ఒకరికొకరు అభినందనలు తెలిపారు. పలువురు విద్యార్థులు తాము సాధించిన డిగ్రీ పట్టాలతో తల్లిదండ్రులతో కలిసి సెల్ఫీ ఫొటోలు దిగి సందడి చేశారు.

వీఎస్‌యూ నంబర్ వన్ స్థానంలో నిలుస్తుంది

విక్రమసింహపురి యూనివర్సిటీ పురోగభివృద్ధితో నంబర్ వన్ స్థానంలో నిలుస్తుందని ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ జి.సతీష్‌రెడ్డి అన్నారు. వీఎస్‌యూ స్నాతకోత్సవాలకు హాజరైన ఆయన మాట్లాడుతూ వీఎస్‌యూకు న్యాక్ సంస్థ ఏ గ్రేడ్‌ను ఇవ్వడం చాలా మంచి పరిణామమని చెప్పారు. వీఎస్‌యూ సమాజానికి మంచి పౌరులను అందిస్తుందన్నారు. ప్రముఖ కవి తిక్కన నెల్లూరుకు సంబంధించిన వారేనని, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జిల్లాలోనే చదువుకున్నారని, భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు జిల్లా వాసినని గుర్తు చేశారు. విద్యార్థులు ప్రతి ఒక్కరూ ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగి తల్లిదండ్రులకు గుర్తింపు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 29 మందికి గోల్డ్ మెడల్స్, 21 మందికి పరిశోధనా డాక్టరేట్లు 275 మందికి డిగ్రీ పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి, నుడా వైస్ చైర్మన్ టి.బాపిరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, వీఎస్‌యూ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న గవర్నర్ అబ్దుల్‌నజీర్



గ్రాడ్యుయేట్ పూర్తి చేసిన విద్యార్థులు ప్రమాణం చేస్తున్న దృశ్యం



గవర్నర్ చేతుల మీదుగా వీఎస్‌యూ గౌరవ డాక్టరేట్ పొందుతున్న ప్రముఖ ఈఎన్‌టీ శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ ఈసీ వినయ్‌కుమార్



హాజరైన కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, జేసీ సేతుమాధవన్ తదితరులు



గ్రేస్ కమిటీ సమావేశంలో వీఎస్‌యూ ప్రొఫెసర్లతో గవర్నర్ అబ్దుల్ నజీర్

స్ట్రాంగ్ రూములను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

నెల్లూరు (దర్గామిట్ట): ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూములను కలెక్టర్ ఎం.హరినారాయణన్, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ పరిశీలించారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు రోజు వారీ తనిఖీల్లో భాగంగా బుధవారం కనుపర్తిపాడులోని ప్రియదర్శిని కళాశాలలో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూములను, స్ట్రాంగ్ రూములను సీసీ టీవీల ద్వారా మానిటరింగ్ చేస్తున్న కంట్రోల్ రూమ్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ తనిఖీల్లో నెల్లూరు సిటీ రిటర్నింగ్ అధికారి వికాస్ మర్మత్, కోవూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సేతుమాధవన్ ఉన్నారు.



స్ట్రాంగ్ రూముల పరిశీలనకు వస్తున్న కలెక్టర్, ఎస్పీ

వెబ్‌సైట్‌లో ఏపీ ఓపెన్ స్కూల్ అభ్యాసకుల హాల్ టికెట్లు

నెల్లూరు (టౌన్): ఏపీ ఓపెన్ పదో తరగతి, ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే అభ్యాసకుల హాల్ టికెట్లు www. apopenschool. ap. gov. in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు డీఈఓ పీవీజే రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పేరు, పాఠశాల పేరు, విద్యార్థి పేరు ఉపయోగించి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఏపీ ఓపెన్ స్కూల్ పరీక్షలు వచ్చే నెల 1 నుంచి 8వ తేదీ వరకు జరగనున్నట్లు తెలిపారు.

రేపటి నుంచి 'పది' పరీక్షలు

- పకడ్బందీగా అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ
- జిల్లా వ్యాప్తంగా 39 సెంటర్ల ఏర్పాటు
- హాజరుకానున్న 7,083 మంది విద్యార్థులు
- 3 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల ఏర్పాటు



పది పరీక్షలకు హాజరైన విద్యార్థులు (ఫైల్)

నెల్లూరు (టౌన్): పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే పరీక్షలకు సంబంధించి పూర్తి ఏర్పాట్లు చేశారు. ఈ నెల 24 నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు పది అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయి. గతంలో మాదిరి కాకుండా సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులను రెగ్యులర్ విద్యార్థులుగానే పరిగణించనున్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో 34,708 మంది విద్యార్థులు పది రెగ్యులర్ పరీక్షకు హాజరయ్యారు. ఈ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు పది అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరుకానున్నారు.

7,083 మంది విద్యార్థుల హాజరు

పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 7,083 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.40 గంటల వరకు పరీక్షను నిర్వహించనున్నారు. పది అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల కోసం జిల్లా వ్యాప్తంగా మొత్తం 39 సెంటర్లను ఏర్పాటు చేశారు. విద్యార్థులను పరీక్ష సమయానికి గంట ముందుగానే కేంద్రంలోకి అనుమతించనున్నారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు 3 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. ఇప్పటికే పరీక్షలకు సంబంధించి విద్యార్థుల హాల్ టికెట్లను జిల్లా పరీక్షల విభాగం వారు ఆయా పాఠశాలల హెడ్ మాస్టర్లకు పంపించారు. ఈ హాల్ టికెట్లను హెడ్‌మాస్టర్లు డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు అందజేయాల్సి ఉంది. ఇప్పటికే జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పది ఫెయిల్ అయిన విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఆయా సబ్జెక్ట్‌లకు సంబంధించి తరగతులు నిర్వహించారు. ప్రతి రోజు విద్యార్థులకు స్లిప్ టెస్ట్‌లు నిర్వహించి విద్యార్థులు మరింత మెరుగ్గా రాణించేందుకు చర్యలు తీసుకున్నారు.

సబ్జెక్ట్‌ల వారీగా హాజరుకానున్న విద్యార్థులు

తేదీ	సబ్జెక్ట్	విద్యార్థులు
24	తెలుగు	2,056
25	హిందీ	1,079
27	ఇంగ్లిష్	1,157
28	మ్యాథ్స్	3,787
29	ఫిజిక్స్	3,100
30	బయాలజీ	2,370
31	సోషల్	2,625

పకడ్బందీగా నిర్వహిస్తాం

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లును పూర్తి చేశాం. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పరీక్షల్లో అవతవకలు చోటు చేసుకోకుండా ఉండే విధంగా ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశాం. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఉండే విధంగా సెంటర్లను ఏర్పాటు చేశాం.

– పీవీజే రామారావు, డీఈఓ

సజావుగా పరీక్షల నిర్వహణ

పది సప్లిమెంటరీ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా ఉండేందుకు 3 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేశారు. ఇప్పటికే పరీక్షలకు సంబంధించి దాదాపు 600 మందికి పైగా ఇన్విజిలేటర్లను నియమించనున్నారు. వీరితో పాటు 39 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, 39 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లను నియమించారు. పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు, లైట్లు, ఫ్యాన్లు ఉండే విధంగా చర్యలు తీసుకున్నారు. పరీక్షా కేంద్రం వద్ద ఏఎన్‌ఎంతో పాటు మెడికల్ కిట్‌ను ఏర్పాటు చేయనున్నారు. విద్యార్థులను క్షుణ్ణంగా పరీక్షించిన తర్వాతే కేంద్రంలోకి అనుమతించనున్నారు.

ఎన్నికల యంత్రాంగం పచ్చ పాతం

జిల్లా ఎన్నికల యంత్రాంగం పారదర్శకం మాటున 'పచ్చ'పాతం చూపించింది. పారదర్శక ఎన్నికలంటూ ఊదరగొట్టిన ఈసీ నుంచి నియోజకవర్గ స్థాయి ఎన్నికల నిర్వహణాధికారులు ఎన్నికల నిర్వహణలో ఒక పక్షానికి మద్దతుగా అనుకూలంగా పనిచేశారు. ప్రచారం నుంచి పోలింగ్ రోజు వరకు టీడీపీ నేతలు అక్రమాలకు, దౌర్జన్యాలకు పాల్పడ్డారు. ప్రశాంత వాతావరణం మధ్య ఎన్నికలను నిర్వహించేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సహకరించినా దౌర్జన్యాలు జరిగిన చోట ఆ పార్టీ నాయకులపై మాత్రమే కేసులు నమోదు చేశారు.

- బరితెగించి టీడీపీ ప్రలోభాల పర్వం
- గిరిజనలకు నగదు పంపిణీ చేస్తూ అడ్డంగా దొరికిన సోమిరెడ్డిపై చర్యల్లేవ్
- వీడియో ఆధారాలతో ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- నామమాత్రపు విచారణతో 'మానవత్వం' అంటూ తోసిపుచ్చారు
- ఎన్నికల అధికారుల 'సచ్ఛీలత'పై ఆరోపణలు



ఎన్నికల ప్రచారంలో డబ్బులు పంపిణీతో ప్రలోభాల పర్వానికి తెరలేపారు. అయితే ఈ వ్యవహారంపై మండల స్థాయి అధికారులు మొక్కుబడిగా విచారణ చేసి.. మానవత్వంతో చేసిన సహాయం అంటూ తొసిపుచ్చారు. ఎన్నికల వేళ టీడీపీ ప్రలోభాలకు 'మానవత్వం' అంటూ సర్టిఫికెట్ ఇవ్వడంపై ఎన్నికల అధికారుల 'సచ్ఛీలత'ను ప్రశ్నిస్తోంది. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని ఊదరగొట్టిన అధికారులు ఆధారాలతో సహా పట్టుబడిన సోమిరెడ్డిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విస్మయం కలిగిస్తోంది. సర్వేపల్లిలో ప్రచారం నుంచి ఎన్నికల వరకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు అక్రమాలకు పాల్పడినా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. చాలా పోలింగ్ కేంద్రాలలో దౌర్జన్యాలకు పాల్పడినా పట్టించుకున్న దాఖలాలు లేవు.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లా ఎన్నికల అధికార యంత్రాంగం విధి నిర్వహణలో పక్షపాత వైఖరితో 'ప్రజాకోర్టు'లో 'పచ్చ'పాతిగా మిగిలింది. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల నిర్వహణపై విస్తృత చర్చ జరుగుతున్న నేపథ్యంలో రేపటి రోజున 'న్యాయస్థానం'లో దోషిగా నిలబడాల్సిన పరిస్థితి అనివార్యం కానుంది. గత ఐదు విడతలుగా వరుసగా ఓటమి పాలవుతూ వస్తున్న సర్వేపల్లి టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఈ సారి పరాభవం తప్పదని భావించి ఎన్నికల ప్రచారంలో ప్రలోభాలకు పాల్పడ్డాడు. పొదలకూరు మండలం చెర్లోపల్లి గిరిజన కాలనీలో సోమిరెడ్డి ఎన్నికల ప్రచారంలో నగదు పంపిణీ చేస్తూ అడ్డంగా దొరికిపోయారు. ఈ వ్యవహారంపై వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అప్పుడే వీడియో ఆధారాలతో సహా ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినా.. ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు విస్మయం కలిగిస్తోంది. ఎన్నికలకు ముందు డబ్బు, మద్యంను సోమిరెడ్డి విచ్చలవిడిగా పంపిణీ చేశారు. గ్రామ స్థాయి నాయకులను ప్రలోభపెట్టి నగదు ఎరగా వేసి లొంగదీసుకున్నారు. ఓటమి భయం వెంటాడటం వల్లనే సోమిరెడ్డి ఎన్నికల్లో ప్రలోభాలకు పాల్పడినట్టు ప్రచారం జరిగింది. ఇంత జరిగినా అధికారులు నామమాత్రపు చర్యలతో తూతూ మంత్రంగా విచారణ నిర్వహించి మిన్నకుండిపోయారు.

ప్రలోభాల పర్వం.. మానవత్వమా?

ప్రలోభాల పర్వానికి జిల్లా ఎన్నికల అధికార యంత్రాంగం 'మానవత్వం' అంటూ కొత్త భాష్యం చెప్పింది. జిల్లా అధికారులు పచ్చపాతమో, పక్షపాతమో తెలియదు కాని వారికి అందిన ఫిర్యాదులపై విచారణ సక్రమంగా చేపట్టలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సోమిరెడ్డి

వైఎస్సార్‌సీపీ నాయకులపై కేసులు

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సహకరించినా దౌర్జన్యాలు జరిగిన చోట వైఎస్సార్‌సీపీ నాయకులపై మాత్రమే కేసులు నమోదు చేసి ఎన్నికల యంత్రాంగం 'పచ్చ'పాతంతో వ్యవహరించింది. ఎన్నికల సంఘం కూడా పక్షపాత వైఖరి అవలంబించినట్టు సర్వేపల్లిలో విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తోంది. టీడీపీ ఎన్నికల ప్రచారంలో స్వయాన టీడీపీ అభ్యర్థే గిరిజన కాలనీలో నగదు పంపిణీ చేసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనుక ఎవరి ఒత్తిళ్లు ఉన్నాయో నిగ్గు తేల్చాల్సిన అవసరం ఉందని వైఎస్సార్‌సీపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన ఎన్నికల యంత్రాంగం పక్షపాతంపై ఉన్న అనేక అనుమానాలతో వైఎస్సార్‌సీపీ నేతలు న్యాయపోరాటానికి సిద్ధమవుతున్నారు.


గోల్డ్ మెడల్‌ను చూసుకుంటూ..





కుటుంబసభ్యులతో సంతోషాన్ని పంచుకుంటూ..




డాక్టరేట్ అందుకున్న వారు


విద్యార్థుల ఆనందం

మేం సాధించాం

వారంతా బాగా చదువుకుని పట్టాలు అందుకున్నారు. ఆ సందర్భాన్ని చూసిన కుటుంబసభ్యులు సంతోషంలో మునిగిపోయారు. కష్టపడి విద్యనభ్యసించి గోల్డ్ మెడల్ సాధించిన పిల్లల్ని చూసి తల్లిదండ్రులు మురిసిపోయారు. వెంకటాచలం మండలం కాకుటూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం 8, 9వ స్నాతకోత్సవ వేడుకలు బుధవారం జరిగాయి. దీనికి గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి పలువురికి డాక్టరేట్, గోల్డ్ మెడల్స్, డిగ్రీ పట్టాలు అందజేశారు. పట్టాలు అందుకున్న వారంతా తమ కుటుంబసభ్యులతో ఆనందాన్ని పంచుకున్నారు.

– వెంకటాచలం/నెల్లూరు ఫొటోగ్రాఫర్

రెప్పపాటులో ఘోర రోడ్డు ప్రమాదం


ప్రమాద స్థలం

- అదుపుతప్పి డివైడర్‌ను, లారీని ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు
- బస్సు డ్రైవర్ మృతి, 8 మందికి తీవ్ర గాయాలు
- ఐదు కిలోమీటర్ల మేర స్తంభించిన ట్రాఫిక్

కావలి: దగదర్తి మండలం సున్నపుబట్టి సమీపంలో బుధవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ నిద్రమత్తు కారణంగా వాహనం అదుపుతప్పి డివైడర్‌ను, తర్వాత అవతలి మార్గంలో వస్తున్న లారీని ఢీకొట్టి బోల్తా పడింది. దీంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందగా ఎనిమిది మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. దగదర్తి పోలీసుల కథనం మేరకు.. ఓ ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత విజయవాడ నుంచి 40 మంది ప్రయాణికులతో చెన్నైకి బయలుదేరింది. బుధవారం తెల్లవారుజామున బస్సు సున్నపుబట్టి సమీపంలోకి వచ్చింది. అప్పటికే అది మితిమీరిన వేగంతో ఉంది. ఒక్కసారిగా డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకున్నాడు. దీంతో రెప్పపాటులో వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. వేగం అదుపు కాక అవతలి రోడ్డులో చెన్నై నుంచి విశాఖపట్నం వెళ్తున్న ఖాళీ కంటైనర్ లారీని ఢీకొని జాతీయ రహదారిపై బోల్తా పడింది. కంటైనర్ డ్రైవర్ ప్రమాదాన్ని గుర్తించి చాకచక్యంగా వాహనాన్ని అదుపు చేయడంతో వెనుక భాగంలో మాత్రమే బస్సు ఢీకొట్టింది. దీంతో ప్రమాద తీవ్రత తగ్గి ప్రయాణికులు గాయాలతో బయటపడ్డారు. విజయవాడకు చెందిన బస్సు డ్రైవర్ మేకా శ్రీను (45) ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. అది హైవేపై అడ్డంగా బోల్తా పడడంతో సుమారు ఐదు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం అందుకున్న పోలీసులు, హైవే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో నెల్లూరుకు తరలించారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించడంతో వాహనచోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



బస్సు డ్రైవర్ మృతదేహం

కొనసాగుతున్న కార్డన్ సెర్చ్

నెల్లూరు(క్రైమ్): నేర నియంత్రణ, శాంతిభద్రత పరిరక్షణలో భాగంగా నిర్వహిస్తున్న కార్డన్ సెర్చ్ బుధవారం కూడా కొనసాగింది. జిల్లాలోని ఉదయగిరి, ఉలవపాడు, వలేటివారిపాళెం, కలిగిరి, దుత్తలూరు పోలీసుస్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పోలీసు అధికారులు తెల్లవారుజామునుంచే సోదాలు నిర్వహించారు. సరైన ధ్రువీకరణపత్రాలు లేని 14 మోటార్‌బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. 15 మంది అనుమానితులను అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు.


వివరాలు సేకరిస్తున్న పోలీసు అధికారులు

నిమ్మ ధరలు (కిలో)
పెద్దవి : రూ.75
సన్నవి: రూ.35
పండ్లు : రూ.25



పని నిమిత్తం వెళ్తూ..

- రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఆత్మకూరు: పని నిమిత్తం మోటార్‌బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఈ ఘటన ఆత్మకూరు మండలంలోని దేపూరు అడ్డరోడ్డు వద్ద బుధవారం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. దేపూరు గ్రామానికి చెందిన రామ్‌చరణ్ తన మిత్రుడితో కలిసి మోటార్‌బైక్‌పై బండారుపల్లికి వెళ్తున్నాడు. సోమశిల – ఆత్మకూరు మార్గంలోని బండారుపల్లి అడ్డరోడ్డు సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రక్కు వీరి బైక్‌ను ఢీకొంది. దీంతో యువకులకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఆత్మకూరు 108 అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రులను ఆత్మకూరు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


గాయపడిన రామ్‌చరణ్